ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి

నోడల్ అధికారి శరత్‌చంద్ర





ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్లు , ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు

మణికొండ: పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ప్రాంతంలో విద్యావంతులు అధికంగా ఉన్నప్పటికీ పోలింగ్ శాతం మాత్రం తక్కువగా ఉంటుందన్నారు. అలాంటి పరిస్థితిని మార్చి ఈ ఎంపీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించునేలా కాలనీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు నరేశ్, వెంకట్, లోకేశ్వర్‌రావు, గిరిధర్, కొండల్‌రెడ్డి, దశరథ, వినయ్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- నాయకులు, కార్యకర్తలతో సమావేశం

మణికొండ: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందని, దాన్ని ప్రజలకు వివరించి ఎండగట్టాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండలో మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నపుడు ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కరెంట్ కోతలు, తాగునీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికి అండగా ఉండి సమస్యలపై నిత్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి మన సత్తా చాటుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేసి ఇంటింటికీ తిరుగుతూ గత అసెంబ్లీ ఎన్నికల కన్నా ఈసారి భారీ మెజార్టీ మణికొండ మున్సిపాలిటీలో సాధించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుషోత్తం, మాజీ ఎంపీపీ, పార్టీ సమన్వయకర్త తలారి మల్లేశ్, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బి. శ్రీరాములు, కౌన్సిలర్లు, తతతనాయకులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో అన్నివర్గాలకు మేలు



బీజేపీకి ఓటు వేయాలని కోరుతున్న నాయకులు



గగన్ పహాడ్ ప్రచారంలో సీనియర్ నాయకుడు తిరుపతి రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: పదేళ్ల మోదీ హయాంలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని రాజేంద్రనగర్ సర్కిల్ సీనియర్ నాయకుడు శీలం తిరుపతి రెడ్డి అన్నారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా గగన్‌పహాడ్ బస్తీలో సోమవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమయ్యిందని మండిపడ్డారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన మోదీ విజయం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రోగి రవి, తలారి అశోక్, సూరెడ్డి వినయ్ రెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అడికె జనార్దన్, రావుల భాస్కర్, తలారి చిన్నా, జగన్, వెంకటరమణ గుప్తా, వెల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందాం



టీపీసీసీ సెక్రటరీని సన్మానిస్తున్న కోఆర్డినేటర్



కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి ప్రచారం

మైలార్‌దేవ్‌పల్లి: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని టీపీసీసీ సెక్రటరీ సానెం శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని తన నివాసంలో మైలార్‌దేవ్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా నియమితులైన సామ ఇంద్రపాల్‌రెడ్డి సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సీనియర్ నాయకులు మళ్లీ హస్తం గూటికి చేరడంతో పార్టీకి పూర్వవైభవం వచ్చిందన్నారు. సీనియర్ నాయకులంతా ఏకతాటిపై వచ్చి రంజిత్ రెడ్డిని గెలిపించి సత్తాచాటాలని ఇంద్రాపాల్‌రెడ్డి కోరారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అత్తాపూర్ : అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో అత్తాపూర్ తేజస్వినినగర్ కాలనీ, బాలనగర్ కాలనీ, హరిజనవాడ, వీకర్ సెక్షన్ బస్తీలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఫలాలు అందుతాయన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మోసపూరిత మాటలు నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, మహేందర్, నాగరాజు, సురేశ్ రెడ్డి, మధురెడ్డి, సత్తిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి,రాజు, కృష్ణ,శివారెడ్డి, పిఎంరెడ్డి, మహేందర్‌రెడ్డి, సంతోష్, అర్జున్ , శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో విజ్ఞాన్ కళాశాల విద్యార్థుల సత్తా



అధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అత్తాపూర్ : ఈ నెల 24న వెలువడిన ఇంటర్ ఫలితాల్లో విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపాల్ గౌరీ సతీశ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ విద్యార్థులను సైతం కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మంచి ఫలితాలు సాధించేందుకు కృషిచేశామన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను నవీన్ కుమార్ 980 మార్కులు సాధించాడని తెలిపారు. అలాగే కె.మయూరి (బైపీసీ -954), అస్మాబేగం (945), ఫిరోస్ ఫాతిమా (942) మార్కులు, సీఈసీ విభాగంలో జె.ఆశ్రిత 956, వి.నిఖిత (940)లు మార్కులు సాధించారు. అలాగే ఫస్టియర్‌లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను జి. మౌనిక (460), కమలేశ్వరి (459), ఖాజాబేగం (450), లఖన్ (442), సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను కె. జేజ శ్రీ,కె.వాసల్య(477), లక్ష్మీనర్సింహ (474), షఫీయా (471), అరుణ్ రాథోడ్ (468), షిఫా బేగం (466), ప్రణయశ్రీ (462), ప్రతిమాషిర్డే (462), ఎం.హాసిని (459), బి.హాసిని (458) మార్కులు సాధించారు. కాగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

జంప్ జిలానీలు..!

- పార్టీలు మారుస్తూ రాజకీయ ఎత్తుగడలు
- ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని వైనం
- ఇది కొందరి నాయకుల పరిస్థితి



కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలువురు ప్రజాప్రతినిధులు జంప్ జిలానీలు కొడుతున్నారు. పార్టీలు మారి రోజులు గడవక ముందే తమ సొంత లాభాలు, ప్రయోజనాల కోసం రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారు. తమకు నష్టం జరుగుతుందని అనుకుంటే చాలు అధికారంలో ఉన్నా పార్టీలోకి, లేదా ఏ పార్టీకి బలం ఉంటే అందులోకి చేరుతున్నారు. అయితే కొందరు నాయకులు పార్టీల కండువాలు కప్పుకున్నా.. అక్కడ ఏమి కలిసిరాకపోవడంతో తిరిగి సొంత గూటికి చేరుతున్నారు.

ఉన్నా.. లేనట్లే..?

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ బీఆర్‌ఎస్‌లో ప్రాతినిధ్యం వహించేవారు. అయితే సొంత పార్టీ ప్రజాప్రతినిధులే ఆయన పాలన సరిగ్గా లేదని, ఒంటెద్దు పోకడలకు వెళ్తున్నాడని కలెక్టర్‌కు తమ అవిశ్వాస తీర్మానాన్ని అందించి ఆయనను మేయర్ పీఠం నుంచి గద్దె దించారు. దీంతో మహేందర్‌గౌడ్ తన అనుకూల ముగ్గురు కార్పొరేటర్లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అయితే అందులో చేరి రోజులు కాకముందే మళ్లీ తిరిగి బీఆర్‌ఎస్ గూటికి చేరారు. ఆయన ఏ పార్టీలో ఉన్న నష్టమేనని ఎలాంటి ప్రయోజనం ఉండదని పలువురు ఆరోపిస్తున్నారు. మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ బీఆర్‌ఎస్‌లో ఉన్నా లేనట్లేనని సొంత పార్టీల నాయకులే గుసగుసలాడుతున్నారు.

కేటీఆర్ సమక్షంలో చేరిక..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు శ్రీలతాసురేశ్‌గౌడ్, సాగర్‌గౌడ్, పద్మావతిపాపయ్యయాదవ్, సురేశ్‌గౌడ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో సోమవారం కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో సోమవారం నుంచి ఓటర్ స్లిప్పుల పంపిణీని ప్రారంభించామని సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. శాస్త్రీపురం, అత్తాపూర్ , మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్ డివిజన్లలో ప్రతి బీఎల్‌వో ఆయా బూత్‌ల్లోని ఓటర్లకు స్లిప్పులు అందించినట్లు తెలిపారు.

సన్మానం



సదాలక్ష్మిని సన్మానిస్తున్న ఇంద్రపాల్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు అబ్బెశి సదాలక్ష్మిని తన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఇంద్రపాల్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

మజ్లిస్‌లో చేరిక



మజ్లిస్‌లో చేరిన బీఆర్‌ఎస్ మైనార్టీ నేత ముర్తుజా అలీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన బీఆర్‌ఎస్ మైనార్టీ ముఖ్య నేత మూర్తుజా అలీ తన అనచరులతో కలిసి మజ్లిస్ అధినేత ఓవైసీ సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ముర్తూజాకు మంచి పట్టు ఉంది. గతంలో ఆయన కాంగ్రెస్ లోనూ పలు పదవులు నిర్వర్తించారు. ఆయన మజ్లిస్‌లో చేరడంతో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గట్టి షాక్ తగిలినట్లయ్యింది.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీనర్సింహస్వామి కాలనీవాసులు నరేందర్, చంద్రశేఖర్‌చౌదరి ఆధ్వర్యంలో ఈ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చందు మల్లుల, ప్రధాన సెక్రటరీగా బి.మాధవరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఎస్.శివశంకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా చక్రధర్‌గౌడ్, ట్రెజరర్‌గా మురళీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కే.ఎస్.పాండు, పి.సుబ్బారావు, శివప్రసాద్, మొగల్‌రెడ్డి, కన్నయ్య, పాపాలాల్, ఎం.వి.సత్యనారాయణ, ఎం.సుభాష్‌రెడ్డి నియమకమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ లక్ష్మీనర్సింహస్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే అందరి సలహాలు, సూచనలు తీసుకొని కాలనీ అభివృద్ధికి పాటుపడుతామన్నారు. కాలనీవాసులంతా సహకరించాలని వారు కోరారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

అత్తాపూర్ : రక్తదానం.. ప్రాణదానమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిద్దెల బ్రదర్స్ సురేందర్ రెడ్డి, సురేశ్‌రెడ్డి, బ్లడ్ డొనేషన్ క్యాంపు ఆర్గనైజర్ మహేశ్ అగర్వాల్ అన్నారు. తలసేమియాతో పాటు రక్తహీనతతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు అగర్వాల్ సమాజ్ బ్లడ్ డొనేషన్ క్యాంపు ద్వారా నిర్వహించిన క్యాంపులో 96 యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్ హిల్స్‌లో ఉన్న ప్రముఖ చిన్న పిల్లలు, మహిళల దవాఖాన నిలోఫర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యవంతులు ఆరు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చన్నారు. ప్రముఖ జర్నలిస్టు టీవీ వ్యాఖ్యాత శాంతి స్వరూప్ తాను మరణించే నాటికి సుమారు 100 యూనిట్ల వరకు రక్తాన్ని దానం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మహేందర్, నాగరాజు, అంతిరెడ్డి, రాజురెడ్డి, సోమ అగర్వాల్, సత్తిరెడ్డి, స్టార్ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

బూస్టర్ల ఏర్పాటు



ఖీజ్రా కాలనీ వద్ద ఏర్పాటు చేసిన బూస్టర్

మణికొండ: ఎత్తు ప్రాంతాల్లోని కాలనీలకు నీటి సరఫరా పెంచేందుకు జలమండలి అధికారులు బూస్టర్లను ఏర్పాటు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఖీజ్రా, పాషా తదితర కాలనీలు ఎత్తులో ఉండడంతో నీటి సరఫరా సరిగా జరగడం లేదు. దానికి తోడు గతంలో జన్వాడ వద్ద పైప్‌లైన్ పగిలి నీటి సరఫరాకు అంతరాయం కలగడంతో సదరు కాలనీలవాసులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. దాంతో వారికి సరిపడా నీటి సరఫరా జరగాలంటే బూస్టర్లు ఏర్పాటు చేయాలని జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి నిర్ణయించి వెంటనే పనులు ప్రారంభించగా సోమవారం ముగిశాయి. మంగళవారం ట్రయల్‌రన్‌ను నిర్వహించి నీటి సరఫరాను తనిఖీ చేస్తామని జలమండలి అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన జలమండలి అధికారులకు ఆయా కాలనీల వాసులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నీటి సరఫరా సమయాన్ని మరో 15 నిమిషాల పాటు పెంచాలని వారు కోరుతున్నారు.

'కురుమ కులస్తుల మద్దతు బీజేపీకే'

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర కురుమ సోదరులు ఈసారి ఎన్నికల్లో బీజేపీని బలపర్చాలని సమష్టి నిర్ణయం తీసుకున్నారని కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బీజేపీ పోటీ చేసే నియోజకవర్గాల్లో కురుమ సోదరులు జిల్లాల వారీగా సమ్మేళనాలు నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కురుమల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల వల్ల కురుమ సంక్షేమానికి బాటలు వేసినట్లు అయిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కురుమ సంఘాలన్ని ఏకతాటిపైకి వచ్చి బీజేపీని బలపరచడానికి తీర్మానం చేశాయన్నారు. ఇందులో భాగంగా మొదటి కురుమ ఆత్మీయ సమ్మేళనం వచ్చే నెల 2న ఉప్పల్, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల్లో కురుమ సోదరుల కోసం సభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 2వ తేదీ గురువారం జరగనున్న ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

సుస్థిర పాలన కాంగ్రెస్‌కే సాధ్యం

గోల్కొండ: సుస్థిర పాలన అందించడం కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, ఏ-బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్‌లో ఆ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. అందరు అన్ని వర్గాలకు అతీతంగా కలిసికట్టుగా హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ వలీ ఉల్లా సమీర్‌ను గెలిపించుకోవాలని ఈ సమావేశంలో తీర్మానించారు. కురాకుల కృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సమర్థవంతమైన పాలనను తెలంగాణ ప్రజలు మెచ్చుకుంటున్నారని హైదరాబాద్ స్థానంతోనే కాకుండా తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ.చంద్రశేఖర్, చంటిబాబు తదితరులున్నారు.

'నాట్య తరంగిణి' నృత్యోత్సవం



మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో సోమవారం అంతర్జాతీయ నృత్యోత్సవాలలో భాగంగా కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి , శిల్పారామం సంయుక్తంగా నాట్య తరంగిణి నృత్యోత్సవాన్ని నిర్వహించారు. కలకత్తాకి చెందిన రాజీబ్‌ఘోష్ బృందం కథక్ ప్రదర్శనతో అలరించారు. ఇందులో శివతాండవం, తరణ అంశాలను ప్రదర్శించారు. ఒరిస్సాకి చెందిన దేబాశిష్ పట్నాయక్ ఒడిసీ నృత్యప్రదర్శనలో మధురాష్టకం, అంగిక, అంశాలను, కెనడాకు చెందిన శక్తిసంజన సిరాలా, రిషికేష్, దేవి కీర్తనం అంశాలను , మోహినియట్టం స్వర్ణదీప , పేరిణి సంతోష్ పెరుమాండ్ల పేరిణీ తాండవంను ప్రదర్శించారు. రవి కూచిపూడి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు.ఇందులో పూజ నృత్యం, ఆధ్యాత్మిక రామాయణ కీర్తన, జయము జయము, మూషికవాహన అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువులు సంజయ్‌జోషి, వేదాంతం సత్య నరసింహశాస్త్రి విచ్చేసి కళాకారులను ఆశీర్వదించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



నార్సింగిలో ప్రచారం నిర్వహిస్తున్న అశోక్‌యాదవ్



ఇంటింటి ప్రచారం చేస్తున్న నరేందర్, సీతారంజిత్‌రెడ్డి

మణికొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, టీటీడీ బోర్డు సభ్యురాలు గడ్డం సీతారంజిత్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్, శివపురి కాలనీల్లో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో గల సమస్యలపై కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి పూర్తి స్థాయి అవగాహన ఉందన్నారు. అలాంటి వ్యక్తిని ఎంపీగా గెలిపించుకుంటే సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఎన్నికల కోడ్ వలన కొన్ని ఆలస్యంగా అమలవుతున్నాయని, ఆగస్టు 15 లోగా పంటల రుణమాఫీని చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరా, నాయకులు పాల్గొన్నారు.

మణికొండ చిత్రపురికాలనీలో..

కాంగ్రెస్‌తోనే ప్రగతి సాధ్యమని ఆ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం. జితేందర్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం, మణికొండ చిత్రపురికాలనీలో సోమవారం వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, ఎంపీ సైతం అదే పార్టీకి చెందిన వారు ఉంటే మన ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్ పురుషోత్తం, నాయకులు బి.ముత్యాలు, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, నరేందర్, మాధవి, శ్రీనివాస్, డి. కిరణ్, వినోద్‌కుమార్, రాము, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మణికొండ చిత్రపురిలో జితేందర్ తదితరులు

స్టార్టప్స్ ప్రోత్సాహం కోసం రూ.50కోట్ల నిధి ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: ఔత్సాహిక స్టార్టప్‌లలో రూ. 50 కోట్ల వరకు పెట్టుబడి సహాయం అందించేందుకు యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ (వైఇఎ) మాగ్నిఫిక్ క్యాపిటల్ ట్రస్టులు థైరోకేర్ సృష్టికర్త డాక్టర్ ఎ వేలుమణితో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. అందులో భాగంగా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు నగరంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభాకర్ అలపాటి మాట్లాడుతూ.. గత దశాబ్దకాలంగా స్టార్టప్‌లకు మద్దతు అందిస్తున్నామని, ఈ కొత్త ఫండ్ ప్రారంభం స్టార్టప్ వ్యవస్థ విస్తరణలో ఒక మైలురాయిగా పేర్కొన్నారు. భిన్న రంగాలలో ఆవిష్కరణలు చేస్తున్న స్టార్టప్స్ తమకు info@yeaindia.orgలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

'సోలార్' ఉత్పత్తుల్లో విప్లవాత్మకమైన వృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: ప్రత్యామ్నాయ విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సోలార్ ఉత్పత్తుల్లో అత్యాధునిక ఆవిష్కరణలు మరింత ఊపందుకోనున్నాయని నిపుణులు విశ్లేషించారు. పునరుత్పాదక విద్యుత్‌శక్తిపై మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రెన్యూఎక్స్ ఈవెంట్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా సోలార్ ఉత్పత్తుల తయారీకి పేరొందిన ఎస్ఎమ్ఎ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ సమావేశంలో సంస్థ డైరెక్టర్ కరణ్‌సింగ్ సదస్సులో తమ భాగస్వామ్యం, సంబంధిత వివరాలను వెల్లడించారు. నగరంలో నిర్వహించిన ఈవెంట్‌లో సన్నీ ట్రి పవర్ కోర్ 2, సన్నీ హై పవర్ పీక్ 3 వంటి అత్యాధునిక ఉత్పత్తులను ప్రదర్శించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గచ్చిబౌలి: వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ భానుప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఓ వ్యక్తి (55) కొండాపూర్‌లోని ఆర్టీఓ ఆఫీస్ సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఫ్యాషన్ బైక్ ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. సంబంధిత వ్యక్తులెవరైనా ఉంటే 8712568118 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి నగరంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో మేటి అని తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి లియాకత్ హుస్సేన్ అన్నారు. ఈ సంవత్సరం హజ్ యాత్రకు ఎంపికైన వారి కోసం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లాతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ ఆసుపత్రిలో మొట్ట మొదటి సారిగా ఈ వ్యాక్సినేషన్ కేంద్రం ప్రారంభమైందని ఈ కేంద్రం ఏర్పాటులో డాక్టర్ మజహరుల్లా ఎంతో చొరవ చూపారన్నారు. డాక్టర్ మజహరుల్లా మాట్లాడుతూ.. ప్రతినిత్యం 115 మందికి వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వినాయకరావు, ఏఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు, ఎస్‌పీహెచ్ఈఓ డాక్టర్ మురళీ, పీస్ అండ్ మైత్రి కమిటీ ప్రతినిధి జైనులాబిదిన్ అబెద్, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.